



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9  సంచిక : 356  పేజీలు :8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : కాకినాడ  బుధవారం 26 ఆగస్టు 2026  వెల : 1/-రూ ॥
VOLUME :9  ISSUE :356  PAGES :8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : KAKINADA  WED 26 AUGUST 2026  PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..
## వైసీపీ డ్రామాలను నమ్మొద్దు: లోకేశ్

- రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం
- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని హామీ
- పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్
- కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు బాధ్యత తనదేనని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని

- మిగతా 2లో




## రాయలసీమకు సుజ్లాన్ భరోసా..

### రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
- అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని

- మిగతా 2లో



## బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు

- అవినీతి కేసులను బీసీలపై కక్షగా వైసీపీ చిత్రీకరిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శ
- గత ప్రభుత్వంలో తనతో పాటు బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను గుర్తు చేసిన అచ్చెన్న
- బీసీ రిజర్వేషన్లను 34% నుంచి 24%కి తగ్గించిందీ వైసీపీయేనని ఆరోపణ
- చంద్రబాబు నాయకత్వంలోనే బీసీలకు ఆర్థిక, రాజకీయ సాధికారత అని వ్యాఖ్య
- రిజర్వేషన్ల పునరుద్ధరణపై న్యాయపరంగానూ పోరాడతామని స్పష్టీకరణ

- మిగతా 2లో



## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..
## ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

- గోదావరి పుష్కరాల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ
- రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ
- భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం
- పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

పెన్ పవర్ డెస్క్:వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల పనుల పురోగతిపై సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2025 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే ఈ మహా వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రవాణా, పారిశుధ్యం, నిరంతరాయ తాగునీటి సరఫరా, వైద్య సేవలు, భద్రత, వసతి కల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా ఒక ప్రజా ఉద్యమంలా

- మిగతా 2లో



### రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు..
### ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తులతో రేవంత్ రెడ్డి చేతులు కలుపుతున్నారన్న అర్వింద్
- దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని వ్యాఖ్య
- కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని వ్యాఖ్య
- ఇకపై రేవంత్ ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వెల్లడి


- మిగతా 2లో

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

### హాజరైన సీఎం చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావు
- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు

- మిగతా 2లో



## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే
## వైసీపీదే విజయం

- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా

- మిగతా 2లో





### ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్‌గా 48 గంటల దీక్షకు పిలుపు
- రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్షను ముగించాలని సూచించిన సీనియర్ నేతలు
- నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన ఎంపీ కె. లక్ష్మణ్
- రూ.15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమన్న బీజేపీ

- మిగతా 2లో




### కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు:
## జూబ్లీహిల్స్ సీఐపై వేటు

- మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ సస్పెండ్
- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, నిందితుడిని పట్టుకోవడంలో విఫలమవడమే కారణం
- రియల్టర్‌పై హత్యాయత్నం కేసులో సుమంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు
- మంత్రి కుమార్తె వ్యాఖ్యల వివాదం కొనసాగుతుండగానే ఈ పరిణామం చోటుచేసుకుంది

- మిగతా 2లో

### 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

- తీరప్రాంతం వెంబడి 5,499 హెక్టార్లలో తాటి వానాలను ఏర్పాటు చేస్తున్నామన్న పవన్
- తుపాన్లు సంభవించినప్పుడు తీరప్రాంత గ్రామాలకు రక్షణ గోడలా పనిచేస్తాయని వెల్లడి
- కఠిన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకునే శక్తి తాటిచెట్లకు ఉందని వ్యాఖ్య


- మిగతా 2లో




## నేరం చేయకుండానే జైలు జీవితం..
## 'చంచల్‌గూడ'లో సరికొత్త అనుభవం!

- హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో 'తెలంగాణ జైల్ ఎక్స్‌పీరియన్స్'
- డబ్బులు చెల్లించి ఒక్కరోజు ఖైదీగా గడిపే వినూత్న అవకాశం
- ఖైదీల దుస్తులు, భోజనం.. క్రమశిక్షణతో కూడిన జైలు జీవితం
- ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో జైల్ ఎక్స్‌పీరియన్స్

- మిగతా 2లో



# జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తోట నరసింహం,తోట రాంజీ




**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 25:** తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైసీపీ ముఖ్య నాయకుల సమావేశంలో జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి,మాజీ మంత్రి తోట నరసింహం,రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ పాల్గొన్నారు.సమావేశం అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో తోట నరసింహం,తోట రాంజీ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అఖండ గోదావరిని ఆరాధించేలా పుష్కరాలు





### భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు.. పవిత్రతకు పెద్దపీట

**అమరావతి/కాకినాడ పెన్ పవర్, ఆగస్టు 25:** ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ అఖండ గోదావరి పుష్కరాలు--2027ను అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి పవిత్రతకు ఎక్కడా భంగం కలగకుండా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలను నిర్వహించనున్నారు.

సచివాలయంలో మంగళవారం గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు ఇంకా పది నెలల సమయం మాత్రమే ఉన్నందున రూ.4,026 కోట్లతో చేపడుతున్న 4,932 పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.899 కోట్ల నిధులను ఆర్థిక శాఖ కేటాయించినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరిలో 625, కోనసీమలో 1,501, ఏలూరులో 426, కాకినాడలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలని, కేంద్ర సాయాన్ని కూడా పొందాలని సీఎం సూచించారు.

### 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం

2015 మహా పుష్కరాల్లో రాష్ట్రంలో సుమారు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేయగా, 2027 పుష్కరాలకు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రోజుకు కోటి మంది వరకు పుణ్యస్నానాలు చేసే అవకాశం ఉన్నందున రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు 181 కొత్త ఘాట్లను నిర్మించనున్నారు.

### ఆలయాలు, పర్యాటక ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్

గోదావరి పరివాహక ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. పిఠాపురం శక్తిపీఠం, నాలుగు పంచారామ క్షేత్రాలు, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రముఖ ఆలయాలను పుష్కర పర్యాటక మార్గంలో చేర్చాలని తెలిపారు. భక్తులు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని, కొత్త హోటళ్లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టాలని, దేశ, విదేశాల్లోని ప్రముఖులను గోదావరి పుష్కరాలకు ఆహ్వానించాలని సీఎం సూచించారు. రాష్ట్ర విశిష్టత, ప్రతిష్టను ప్రపంచానికి చాటేలా కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. పుష్కర ఘాట్లకు అనుసంధానించే రహదారులతో పాటు పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని ఆదేశించారు.పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారులను అభివృద్ధి చేయాలని, వంతెనల సామర్థ్యాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గోదావరిలోకి మురుగునీరు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలోని దీవుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని తెలిపారు.

### రద్దీ నిర్వహణకు ఏఐ సాంకేతికత

పుష్కరాల్లో భద్రత, రద్దీ నియంత్రణ కోసం ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ--ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. వైద్య సేవలకు సంబంధించి అంబులెన్స్‌లు, ఫస్ట్‌ఎయిడ్ కేంద్రాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు 30 తాత్కాలిక ఫీల్డ్ ఆస్పత్రులు, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లను సిద్ధం చేయనున్నట్లు వివరించారు.

### 50 మోడల్ పుష్కర పంచాయతీలు

గోదావరి పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని మునికూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం--పట్టిసీమ రోడ్డు, సీతానగరం--సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ బీటీ రోడ్డు, అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టనున్నారు.

పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులను వినియోగించనున్నారు. 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రత కోసం 2,697 రెస్క్యూ బోట్లు, 8,955 మంది శిక్షణ పొందిన ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు.గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు కలిసే ఉపనదులు, వాగులు, ఏరులను పరిగణనలోకి తీసుకుని 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలను నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం, భద్రత, వసతి వంటి సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, వై. సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

-పాండవులపాలెం,ఉలిగోగుల గ్రామాలకు నూతన అంగన్వాడీ కేంద్రాల మంజూరు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు,25:** ప్రత్తిపాడు మండలంలోని గిరిజన గ్రామాలైన పాండవులపాలెం,ఉలిగోగుల గ్రామాల్లో నూతనంగా మంజూరయిన అంగన్వాడీ కేంద్రాలను జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీతో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సత్యప్రభతో పాటు ప్రముఖులకు ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ధర్తి అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులు,గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ చిన్నారులకు బాల్య దశ నుంచే మెరుగైన విద్య,పోషకాహారం,ఆరోగ్య సంరక్షణ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో విద్యాభ్యాసానికి పునాది పడటంతో పాటు గర్భిణులు,బాలింతలకు అవసరమైన సేవలు అందుతున్నాయన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.విద్య,వైద్యం,మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేయడం ద్వారా చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు.అలాగే సిడిపివో పద్మావతి మాట్లాడుతూ ప్రత్తిపాడు,శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆరు నూతన అంగనవాడి కేంద్రాలు గిరిజన గ్రామాలకు మంజూరైనట్లు తెలిపారు. ఎంఈఓ, వి రాజబాబు,ఐసీడీఎస్ అధికారులు, సూపర్వైజర్ చక్రవేణి,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పీజీఆర్ఎస్‌పై స్పందన తెలియజేయండి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 25:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు. పీజీఆర్ఎస్ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు పౌరుల సంతృప్తిని మెరుగుపరిచేందుకు నిరంతరం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.జిల్లా,మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను ప్రముఖంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.పీజీఆర్ఎస్ సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సులభంగా నమోదు చేయవచ్చని తెలిపారు.క్యూఆర్ కోడ్ ద్వారా అందించే ప్రజల స్పందన అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ అభిప్రాయాలను తెలియజేయడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు.ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించడంతో పాటు, సేవలపై తమ స్పందనను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.







# కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా

మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్, ఆగస్టు 25:** తెలుగుదేశం పార్టీలోని ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి టీడీపీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం మంత్రి అందజేశారు .మండల పరిధిలోని కందులపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వినకోటి స్టాలిన్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. దీంతో టీడీపీ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును స్టాలిన్ భార్య అనూషకు మంత్రి సుభాష్ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.కార్యకర్త కష్టాల్లో ఉంటే పార్టీ కుటుంబంలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.కోటి మందికి పైగా సభ్యులతో బలమైన కుటుంబంగా ఉన్న టీడీపీ,కార్యకర్తలకు కష్టకాలంలో భరోసాగా నిలుస్తోందన్నారు.టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాద బీమా కార్యక్రమాన్ని అమలు చేయడం అభినంద నీయమన్నారు.ప్రమాద బీమా ద్వారా స్టాలిన్ కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి సుభాష్ అన్నారు.కార్యకర్తల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం టీడీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, వయిట్ల గజలక్ష్మి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## మిలాద్ ఉన్ నబి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి



**సామర్లకోట, పెన్ పవర్,ఆగస్టు 25:** పెద్దాపురం డివిజన్ పరిధిలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ప్రశాంత వాతావరణంలో,సోదరభావంతో నిర్వహించాలని పెద్దాపురం డీఎస్పీ బాలగంగాధర్ తిలక్ సూచించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మత పెద్దలు, యువత వేడుకలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మత పెద్దలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో మిలాద్ ఉన్ నబి వేడుకలను పురస్కరించుకుని పోలీసులు పూర్తి భద్రతా ఏర్పాట్లతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ బాలగంగాధర్ తిలక్ వెల్లడించారు.ఈ సమావేశంలో సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్, పెద్దాపురం సీఐ వై.ఆర్.కే. శ్రీనివాస్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్లకే నాలుగు ప్రతిష్ఠాత్మక రికార్డులు

**143 సెకన్లలో 113 ప్రశ్నలకు మెరుపువేగంతో సమాధానాలు**





**గండేపల్లి , పెన్ పవర్, ఆగస్టు, 25** నాలుగేళ్ల పసి వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శించి నాలుగు ప్రతిష్ఠాత్మక రికార్డులను సొంతం చేసుకున్న గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన చిన్నారి దాసరి ఆద్య శ్రీ అందరి ప్రశంసలు అందుకుంటోంది. దాసరి చరణ్ తేజ--మేఘన దంపతుల కుమార్తె అయిన ఆద్య శ్రీ తన జ్ఞాపకశక్తి, ప్రతిభ, సమయస్ఫూర్తితో అబ్బురపరిచింది.

భారతదేశ రాష్ట్రాలు--రాజధానులు, ప్రపంచ దేశాల రాజధానులు, భారతదేశానికి సంబంధించిన జనరల్ నాలెడ్జ్ అంశాలపై మూడు విభాగాల్లో మొత్తం 113 ప్రశ్నలకు కేవలం 143 సెకన్లలో వేగంగా, స్పష్టంగా, వరుసగా సమాధానాలు ఇచ్చి తన ప్రతిభను చాటుకుంది. నాలుగేళ్ల వయసులోనే ఇంతటి అసాధారణ ప్రతిభ కనబరచడం విశేషమని గ్రామస్థులు కొనియాడారు.

చిన్నారి ఆద్య శ్రీ ప్రతిభను తెలుసుకున్న క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి వసంత్ ఆమెను అభినందించారు. మురారి గ్రామ పెద్దలు, ప్రజలు చిన్నారి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆద్య శ్రీకి ఆశీస్సులు అందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

చిన్నారి ఆద్య శ్రీ ప్రతిభ గ్రామానికే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.ం

## రెడ్ క్రాస్ ఐ బ్యాంకు ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు




**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 25**: ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఐ బ్యాంకు ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి కె. శివకుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్. లావణ్యకుమారి,రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు తదితరులు ఐ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు సహకరించనున్నట్లు తెలిపారు. నేత్రదానం ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, మరణానంతరం నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

కంటి చూపును కోల్పోయిన వారికి నేత్రదానం ద్వారా చూపును ప్రసాదించవచ్చని, మరణానంతరం తమ నేత్రాలను దానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని అధికారులు తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఐ బ్యాంకు సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.రెడ్ క్రాస్ ఐ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నేత్రదానంపై అపోహలు వీడి మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంకు సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప ప్రత్యేక పూజలు






**సామర్లకోట, పెన్ పవర్, ఆగస్టు 25**: స్వర్ణ పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట పట్టణ పరిధిలోని శ్రీ శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చినరాజప్పకు వేద ఆశీర్వచనం పలికి,స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, అడబాల శ్రీ కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, అందుకుల జార్జ్ చక్రవర్తి, బలుసు వాసు, బొందల రామలక్ష్మీ శ్రీనివాస్, దేవాల్ల జయలక్ష్మి,పిల్లాడి సత్యవతి, కొల్లి సునీత,కాపవరపు కుమార్,గుడాల శంకర్,గొంతు సత్యనారాయణ, కురుకూరి సోమేశ్వరరావు,కృష్ణ బాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖండ గోదావరి పుష్కరాలకు పటిష్ట ప్రణాళిక








- శాఖల సమన్వయంతో భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 25:** అఖండ గోదావరి పుష్కరాలు--2027ను అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు, పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీర పాండ్యన్ అమరావతి నుంచి అఖండ గోదావరి పరివాహక ప్రాంతానికి సంబంధించిన ఆరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుష్కరాల ఏర్పాట్లు,శాఖల సమన్వయం,భక్తులకు మౌలిక వసతులు,పర్యాటక అభివృద్ధి, సర్క్యూట్ టూరిజం,హోమ్‌స్టేలు, స్నానం,దానం,పితృతర్పణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు.అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై పలు కీలక సూచనలు చేశారు.జిల్లాలోని గోదావరి నదీ తీర ప్రాంతాల్లో ఐదు ప్రధాన ఘాట్లను అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి కాలువల వెంబడి తొమ్మిది మండలాల్లో 82 సీ-కేటగిరీ ఘాట్లను గుర్తించినట్లు వెల్లడించారు.ప్రధాన,సీ-కేటగిరీ ఘాట్ల వద్ద భక్తుల రాకపోకలు,భద్రత, పారిశుద్ధ్యం,తాగునీరు,విద్యుత్, వైద్య సేవలు,మరుగుదొడ్లు,పార్కింగ్, రహదారి సౌకర్యాలపై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లకు చేరుకునే రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు, విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ ఇంజనీర్లకు సూచించారు.ఘాట్ల వద్ద బారికేడింగ్,రక్షణ ఏర్పాట్లు,అప్రోచ్ రోడ్లు,పార్కింగ్ ప్రాంతాలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల నుంచి భక్తులు సులభంగా ఘాట్లకు చేరుకునేలా రహదారులను అభివృద్ధి చేసి, అవసరమైన చోట్ల దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజమండ్రి--కాకినాడ కాలువ రోడ్డు తదితర మార్గాలను పుష్కరాల సమయంలో పెరిగే రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

### క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక

పుష్కర ఘాట్లకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర పరిస్థితుల నిర్వహణకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచడంతో పాటు మహిళలు, వృద్ధులు,చిన్నారులు,దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

### సర్క్యూట్ టూరిజానికి ప్రాధాన్యం

పుష్కరాలను ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు,చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలతో అనుసంధానం చేసి పర్యాటకులను ఆకర్షించేలా సర్క్యూట్ టూరిజం ప్రణాళిక రూపొందించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. భక్తులు గోదావరి స్నానం, పూజలు,దానం,పితృతర్పణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రముఖ దేవాలయాలు,పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా సమగ్ర పర్యాటక మార్గాలను రూపొందించాలని సూచించారు.భక్తుల బసకు అవసరమైన హోమ్‌స్టే సౌకర్యాలను ప్రోత్సహించాలని తెలిపారు.

### పారిశుద్ధ్యం, వైద్య సేవలకు ప్రాధాన్యం

పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిరంతరం సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు వంటి ఏర్పాట్లను పుష్కరాలకు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.ఘాట్ల వద్ద ప్రాథమిక వైద్య కేంద్రాలు,అత్యవసర వైద్య సేవలు,అంబులెన్సులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు.ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనులను స్పష్టంగా గుర్తించి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, జడ్పీ సీఈఓ వి.వి.ఎస్. లక్ష్మణరావు,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మహమ్మద్ అబ్దుల్ మతిన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జలవనరుల శాఖ ఇంజనీర్లు,పోలీసు ఉన్నతాధికారులు,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళకు సొంతింటి కల సాకారం





**మంత్రి సుభాష్ మానవత్వానికి మరో నిదర్శనం**

**కె.గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 25:** పేదల సంక్షేమమే తన రాజకీయ జీవిత లక్ష్యమని మరోసారి నిరూపిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఓ నిరుపేద మహిళకు సొంతింటి కలను సాకారం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామానికి చెందిన సలాది శేషవేణికి మంత్రి చొరవతో సొంతిల్లు సమకూరింది.భర్తను కోల్పోయి చిన్న కుమార్తెతో కలిసి పాడుబడిన గుడిసెలో దుర్భర జీవితం గడుపుతున్న శేషవేణి పరిస్థితిని గ్రామ పర్యటనలో మంత్రి సుభాష్ స్వయంగా గమనించారు.ఆమె పరిస్థితికి చలించిన మంత్రి,ఆ కుటుంబానికి సురక్షితమైన గూడు కల్పించాలని సంకల్పించారు.ఇంటి నిర్మాణం కోసం స్వయంగా రూ.65 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు దాతలను కూడా ముందుకు తీసుకువచ్చారు.మంత్రి పిలుపునకు స్పందించిన పామర్తి గోపి రూ.50 వేలు,దేగల నాగేంద్ర రూ.25 వేలు, యరంశెట్టి రాంబాబు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గ్రామ ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించడంతో నూతన గృహ నిర్మాణం పూర్తయింది.అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం నూతన గృహాన్ని ప్రారంభించి,శేషవేణి కుటుంబంతో గృహప్రవేశం చేయించారు. సొంతింట్లోకి అడుగుపెట్టిన సందర్భంగా శేషవేణి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.మంత్రి సుభాష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచి, అవసరమైన వారికి సహాయం అందిస్తున్న మంత్రి సుభాష్‌ను వారు అభినందించారు. నిరుపేద మహిళకు గూడు కల్పించడం కేవలం ఇంటి నిర్మాణం కాదని, ఓ కుటుంబానికి భరోసా,భవిష్యత్తుకు భద్రత కల్పించడమేనని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్యవాడ గ్రామ నాయకులు సలాది శ్రీను, ఎంపీటీసీ సలాది ఎర్రిబాబు, సలాది రమేష్,దేవరపల్లి చక్రి,తోట వెంకన్న, బండారు చిన్నబాబు,సలాది సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరంలో భక్తుల ఆవేదన.. దానాల పేరుతో ఒత్తిడి?

**వ్రత పురోహితుల తీరుపై భక్తుల ఆరోపణలు.. దానాల పేరుతో అదనపు మొత్తాలకు ఒత్తిడి చేస్తున్నారంటూ ఫిర్యాదులు**




**పెన్ పవర్ ప్రతినిధి(అన్నవరం,) ఆగస్టు 25:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వ్రతాలు నిర్వహించుకునేందుకు వచ్చే భక్తులకు కొందరు వ్రత పురోహితుల వ్యవహారశైలి ఇబ్బందికరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్రతం పూర్తయిన అనంతరం దానాల పేరుతో అదనపు మొత్తాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం, వ్రతం కోసం వచ్చే భక్తులు ఇలాంటి పరిస్థితులతో అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. తాము కోరిన మేరకు డబ్బులు ఇవ్వకపోతే కొందరు పురోహితులు తీవ్రంగా మాట్లాడుతున్నారని, భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

శానిటేషన్ సిబ్బంది తీరుపైనా ఫిర్యాదులు

వ్రత మండపాల పరిసరాల్లో విధులు నిర్వహించే కొందరు శానిటేషన్ సిబ్బంది కూడా భక్తులతో అనుచితంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. భక్తుల నుంచి వస్తున్న ఆరోపణలపై దేవస్థానం అధికారులు సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

సీసీ ఫుటేజీ పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి

వ్రత మండపాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని అధికారులు పరిశీలిస్తే భక్తుల ఆరోపణల్లో వాస్తవమెంత, అపోహలెంత అనేది స్పష్టమవుతుందని భక్తులు అంటున్నారు. ఫిర్యాదులను కేవలం సాధారణంగా తీసుకోకుండా సంబంధిత సిబ్బంది, పురోహితులతో పాటు భక్తుల నుంచి కూడా వివరాలు సేకరించి విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

భక్తుల విశ్వాసమే దేవస్థానానికి ప్రధాన బలం. వ్రతాలు, దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన వ్యవస్థను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భక్తుల నుంచి బలవంతపు వసూళ్లకు తావులేకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతున్నారు.

దేవస్థానం అధికారులు తక్షణమే స్పందించి భక్తుల ఫిర్యాదులపై విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సంచార జాతుల సమస్యలపై బీజేపీ క్షేత్రస్థాయి అధ్యయనం




**సంక్షేమ పథకాల అమలులో లోటుపాట్లపై దృష్టి**

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 26:**అమలాపురం రూరల్

మామిడికుదురు: తరతరాలుగా స్థిర నివాసం, ఉపాధి అవకాశాలకు దూరంగా జీవిస్తున్న సంచార జాతుల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు బీజేపీ సంచార జాతుల విభాగం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. జిల్లా కన్వీనర్ వీర్నాల రమణబాబు నేతృత్వంలో అమలాపురం రూరల్, మామిడికుదురు మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించిన బృందం.. ఆయా వర్గాల కుల పెద్దలు, ప్రతినిధులతో నేరుగా మమేకమై వారి సమస్యలను నమోదు చేసింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పసుపులేటి మహాలక్ష్మి రావుతో పాటు నాయకులు సంచార జాతుల జీవన విధానం, ఉపాధి ఇబ్బందులు, నివాస సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను కేవలం వినడానికే పరిమితం కాకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

"అర్హత ఉన్నా సంక్షేమ పథకాలకు దూరమయ్యే పరిస్థితి ఉండకూడదు" అనే లక్ష్యంతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సంచార జాతుల పెద్దలను కోరారు. ఈ పర్యటనతో సంచార జాతుల సమస్యలను క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లే దిశగా బీజేపీ కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లయింది.

స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకంగా మారుతుందని ఇటీవలి అమలాపురం ప్రాంతీయ వార్తా నివేదికలు కూడా సూచిస్తున్నాయి.

## మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లిం సోదరులకు ఎస్పీ శుభాకాంక్షలు



**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 25:** మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా మసీదులు, దర్గాలు, ప్రార్థనా స్థలాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రార్థనలు, ఊరేగింపులు, ఇతర పండుగ కార్యక్రమాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. పండుగ వేడుకల్లో ప్రజలు పరస్పర సహకారం, సోదరభావంతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 4వ బెటాలియన్‌లో 37 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 25:** 4వ (ఐఆర్) బెటాలియన్, ఏపీఎస్పీ, రాజమహేంద్రవరం పరిధిలో వివిధ ఉద్యోగాల భర్తీకి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ తెలిపారు. మొత్తం 37 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇందులో రికార్డ్ అసిస్టెంట్--1, ఆఫీస్ సబార్డినేట్--1, స్వీపర్--9, కార్పెంటర్--3, కుక్--14, ధోబీ--5, బార్బర్--4 పోస్టులు ఉన్నాయని తెలిపారు. పోస్టులకు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, విద్యార్హతలు, ఇతర వివరాలు ష్ట్రజూం://ఝుర్‌స్త్రశీఝుఝుతీఱ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 27, 2026 ఉదయం 10 గంటల నుంచి సెప్టెంబర్ 5, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలతో నింపిన దరఖాస్తులను కమాండెంట్, 4వ (ఇండియా) బెటాలియన్, ఏపీఎస్పీ, ఏ.వి. అప్పారావు రోడ్డు, లాలాచెరువు, రాజమహేంద్రవరం--533106 చిరునామాకు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు చివరి తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని అధికారులు తెలిపారు.

## గోనేడలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం.

- ★ విజృంభిస్తున్న దోమలు.
- ★ ఆందోళన చెందుతున్న ప్రజలు
- ★ పట్టించుకోని అధికారులు.




**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 25**:కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ తీవ్ర దుర్వాసన, అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, మెరుగైన పారిశుధ్యం అందించాలని ఉన్నతాధికారులు సూచించినా.. క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గోనేడ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## సాదిక్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలి.



**-కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో బిజెపి నాయకులు ఫిర్యాదు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 25:**పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ కుటుంబం ఆత్మహత్యకు కారణమైన సాదిక్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలని కిర్లంపూడి మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఎస్సై, జి సతీష్ కు ఫిర్యాదు చేశారు. లవ్ జిహాద్ పేరుతో అభం శుభం తెలియని హిందూ మహిళలపై వలవేసి మభ్యపెట్టి వాళ్లను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ, మతం మారమని ప్రేరేపిస్తూ, మారకపోతే చంపేస్తామని బెదిరిస్తూ, అరాచకాలకు పాల్పడుతున్న సాదిక్ ఖాన్ వంటి మతోన్మాద నేరగాడిని కఠినంగా శిక్షించాలని అటువంటి నేరగాళ్లకు విధించే శిక్షలు చూసి భవిష్యత్తులో ఎవరూ కూడా నేరాలు చేయడానికి భయపడే విధంగా సాదిక్ ఖాన్ ను శిక్షించాలని కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కు ఫిర్యాదు చేసారు. ఈ విషయంపై రాష్ట్ర హోం మంత్రి, డిజిపి స్పందించి నేరస్తుడికి కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుండల సాయి కుమార్ యాదవ్ సూచన మేరకు, కిర్లంపూడి మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు, మండల ఓబిసి మోర్చా అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, యువ నాయకులు కోలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాట్రావులపల్లిలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో 12 మందికి రూ.5,38,244 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు కావడంతో మంగళవారం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై 12 మంది ఇండ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం నుండి వచ్చిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు వరంగా మారాయని అన్నారు. ముఖ్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పార్టీల భేదాలు లేకుండా అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, అడబాల వెంకటేశ్వరరావు, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య తదితర గ్రామ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిర్ణీత ధరలకే ఎరువుల అమ్మకాలు చేపట్టాలి.....



**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 25:-** రైతులకు ఎరువులను నిర్ణీత ధరలకు మాత్రమే అమ్మాలని వ్యవసాయ అధికారి పి గాంధీ తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామశీలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి వివిధ రకాల ఎరువులను రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే అమ్మాలని, కొనుగోలుదారులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. దుకాణాల వద్ద ఎరువులు, పురుగు మందుల ధరల పట్టిక ప్రదర్శించాలని తెలిపారు. రిజిస్టర్ లను,స్టాక్ ను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఉద్యాన సహాయకులు గోవిందరాజు, దుకాణాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తా



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 26:** స్థానిక రావులమ్మ నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సోషల్ మీడియా ప్రతినిధులతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న నిరుద్యోగులను గుర్తించి వారి విద్యార్హతను బట్టి పూర్తి బయోడేటాను సేకరించి ప్రత్యేక వెబ్ సైట్ లో పొందుపరుస్తామని, తద్వారా ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి నోటిఫికేషన్ వారికి చేరేలా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10,060 పోస్టుల జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్ తో పాటు రాష్ట్రంలో రాబోయే భారీ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని అన్నారు. కాకినాడ గ్రీన్ ఎనర్జీ, నక్కపల్లి స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్, భోగాపురం ఎయిర్ పోర్ట్ వంటి సంస్థల ద్వారా రాబోయే రోజుల్లో దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు రానున్నాయని, వాటిలో అర్హతను బట్టి జగ్గంపేట యువతకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. ఇవే కాకుండా ఉద్యోగం రాని వారికి స్వయం ఉపాధి అవకాశాలు కూడా వారి అర్హతను బట్టి కల్పించేలా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో జరిగిన మెగా డీఎస్సీలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా 450 మందికి ఉచిత శిక్షణ ఇస్తే 350 మంది క్వాలిఫై అయ్యారని, 150 మంది ఉత్తీర్ణులై 30 మందికి ఉద్యోగాలు వచ్చాయని, జగ్గంపేట నియోజకవర్గం నుండి 112 మంది టీచర్ పోస్టులు సాధించారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈసారి కూడా ఎక్కువ మంది నియోజకవర్గ యువత ఉద్యోగాలు సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్, కిర్లంపూడి ఎంపీడీవో హరికృష్ణ, గండేపల్లి ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి, గోకవరం ఎంపీడీవో గోవిందు, నియోజకవర్గంలోని డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన పుస్తక నిక్షిప్త కేంద్రాలకు అనుమతులు



**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 26:**
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు నూతన పుస్తక నిక్షిప్త కేంద్రాలకు (బుక్ డిపాజిట్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ అనుమతులు మంజూరు చేశారు. కేశవరం, కాట్రేనిపాడు, రాజులపాలెం, జువ్విగూడెం గ్రామాల్లో ఈ పుస్తక నిక్షిప్త కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా అనుమతులు పొందిన పరిరక్షకులతో సాయిబాబు రాజు మాట్లాడుతూ పుస్తక నిక్షిప్త కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల పాఠకులకు, ముఖ్యంగా యువతకు అందుబాటులో ఉండేలా నిర్వహించాలని సూచించారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచి, కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కేర్‌టేకర్లను ఆదేశించారు. అనంతరం తాళ్లరేవు గ్రంథాలయాన్ని సాయిబాబు రాజు సందర్శించి పాఠకులతో ముచ్చటించారు. గ్రంథాలయంలో అందుతున్న సేవలు, పాఠకుల అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే.జే.ఎస్.ఎల్. కుమారి, కే. కిషోర్, ఎం. శ్రావ్య, సాయి తదితర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు




**కాకినాడ, పెన్ పవర్, ఆగస్టు 25:** జాతీయ స్థాయిలో ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ (జాతీయ అర్హత) పరీక్షను కాకినాడ జిల్లాలో ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నీట్ పీజీ పరీక్ష నిర్వహణపై న్యూఢిల్లీ కర్తవ్యం--1 నుంచి భారత ప్రభుత్వం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జిల్లావ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాల్లో నీట్ పీజీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మహిళా, శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



**రామచంద్రపురం, పెన్ పవర్, ఆగస్టు 25:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, ఆరోగ్య పరిరక్షణ సేవలు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 11 అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం మంత్రి నియామక పత్రాలను అందజేశారు. వీరిలో రామచంద్రపురం మండలానికి చెందిన ముగ్గురు, కె.గంగవరం మండలానికి చెందిన ఎనిమిది మంది ఉన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా 183 మంది అంగన్వాడీ వర్కర్లు, 179 మంది అంగన్వాడీ హెల్పర్లకు మంత్రి యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేస్తున్న కీలక కేంద్రాలని అన్నారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం నాణ్యత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆప్యాయతతో కూడిన వాతావరణం కల్పించి, ఆటపాటలతో కూడిన విద్య ద్వారా వారి మేధో వికాసానికి తోడ్పడాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.
మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, విద్యా వాతావరణం మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వి.వి. వరహాలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.నాగమణి, కళ్యాణి, పార్వతి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దుర్గాదేవి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

## శంఖవరం మండలం లలో 14 పంచాయతీ ఓటరు జాబితా ను ప్రచురించట....



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 25:-** రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ నెం.25 / రాజుజ-దీ2/2026,12.08.2026 అనుసరించి గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబందించి శంఖవరం మండలములోని 14 గ్రామ పంచాయతీలకు సంబందించి ఎస్సీ / ఎస్టి/ బిసి ల గుర్తించిన ఓటర్ల ముసాయిదా జాబితాను శంఖవరం మండలములోని 14 గ్రామ పంచాయతీల నోటీసు బోర్డు నందు 25.08.2026వ తేదిన ప్రచురించట మైనది,వీటి పై ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ గ్రామ పంచాయతీ కార్యదర్శి కి అభ్యంత రములు సమర్పించవలసినదిగా తెలియ జేయడమైనది.

## వందేమాతరం పట్ల కాంగ్రెస్ వైఖరి దేశభక్తి ని ప్రశ్నించేలా ఉంది: నల్లా పవన్ కుమార్



**అల్లవరం, పెన్ పవర్, ఆగష్టు 25**:వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుపై కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశ ప్రజలను ఆలోచింపజేసేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ అన్నారు. మంగళవారం అమలాపురంలో జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేమాతరం కేవలం ఒక గేయం మాత్రమే కాదని, స్వాతంత్ర్యోద్యమంలో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన జాతీయ భావోద్వేగానికి ప్రతీక అని పేర్కొన్నారు. అలాంటి గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో పూర్తి గేయాన్ని ఆలపించకుండా కేవలం రెండు పంక్తులు మాత్రమే పాడతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం బాధాకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు గేయాన్ని మధ్యలో ఆపిన దృశ్యాలు సోషల్ మీడియా వేదికగా ప్రజల ముందుకు వచ్చాయని నల్లా పవన్ కుమార్ అన్నారు. దేశ ప్రయోజనాలు, జాతీయ గౌరవం విషయంలో రాజకీయాలకు వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యువతలో జాతీయ భావాన్ని మరింత పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ గేయాలు మరియు దేశభక్తి భావాలను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని నల్లా పవన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ,జిల్లా బిజెపి అధికార ప్రతినిధి అరిగెల నాని,పట్టణ అధ్యక్షుడు అయ్యలభాస్కరరావు ,గోకరకొండ గంగన్న స్వామి తదితరులు పాల్గొన్నారు .

## జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయంలో జేసీ ఆకస్మిక తనిఖీ





**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 25:** కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం జగ్గంపేట మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన రికార్డు రూమ్, సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కార పురోగతిని జేసీ సమీక్షించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల వీఆర్వోలు,సర్వేయర్లతో సమీక్ష నిర్వహించి మీ సేవ డ్యాష్‌బోర్డులోని వివరాల ఆధారంగా రీ-సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు, 22ఏ, మ్యుటేషన్ తదితర భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సుపరిపాలనను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్, 22ఏ, రీ-సర్వేలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ,భూ పరిపాలనా అంశాలపై రాష్ట్రస్థాయిలో ప్రతి వారం సమీక్షలు జరుగుతున్నందున అధికారులు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించాలని సూచించారు. అనంతరం కార్యాలయ పరిసరాలు, రికార్డు రూమ్‌లను పరిశీలించిన జేసీ కార్యాలయ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ జేవీఆర్.రమేష్,డిప్యూటీ తహశీల్దార్, రీ-సర్వే తహశీల్దార్లు,అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గౌరీ గవర సంఘం ఉపాధ్యక్షులుగా శరకణం రాజబాబు ప్రమాణ స్వీకారం.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,25:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరీ గవర సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరీ గవర సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, జగపతినగరం గ్రామానికి చెందిన శరకణం రాజబాబు ఏకగ్రీవంగా ఎంపిక అవడంతో జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో రాజబాబు ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శరకణం రాజబాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా గౌరీ గవర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బాధ్యతలు అప్పుజెప్పినందుకు జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, జిల్లాలో ఉన్న గవరకుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అనకాపల్లి మాజీ ఎంపీ బీశెట్టి సత్యవతి,పెంటకోట మూర్తి, తనకాల నాగేశ్వరరావు,కర్రి కిషోర్, కర్రి సన్యాసిరావు, బుద్ధ ఈశ్వరరావు, పెంటకోట నాగబాబు,కర్రి సూర్య కుమార్, కొడేల నల్లబ్బాయి,తనకాల రమణ, పెంటకోట శ్రీరాములు, కుర్ల చినబాబు,శరకణం పెదకాపు, పెనగంటి గోవిందు, ఆడారి శ్రీనివాసరావు, ఆళ్ల బాబులు, ఆళ్ల రాఘవులు, శరకణం శివ, మొల్లేటి సాంబశివ, పెంటకోట సత్యనారాయణ, దాడి గోవిందు,అధిక సంఖ్యలో గౌరీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# తుమ్మల బాబుపై ఆరోపణలకు ఆధారాలేవి?..

- గొర్లి నాగేశ్వరావు ప్రశ్న....
- బాబుపై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం...
- ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు...

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 25:–** జనసేన పార్టీ నాయకుడు తుమ్మల రామస్వామి (బాబు)పై ఇటీవల వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విజయవాడ డివిజన్ రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యులు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరావు తెలిపారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి అనేక ఒడిదుడుకులు, కష్టనష్టాలను ఎదుర్కొంటూ పార్టీ బలోపేతానికి తుమ్మల రామస్వామి బాబు క్రమశిక్షణతో పనిచేశారని నాగేశ్వరావు తెలిపారు. ఆయన నిబద్ధత, నాయకత్వ సామర్థ్యం, పార్టీ పట్ల విశ్వాసాన్ని గుర్తించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పలు కీలక బాధ్యతలను అప్పగించారని చెప్పారు.

కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా, పార్టీ ఐదుగురు సభ్యుల కోర్ కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల రామస్వామికి బాధ్యతలు అప్పగించిన విషయాన్ని నాగేశ్వరావు గుర్తుచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సహకార రంగాన్ని రైతులకు మరింత చేరువ చేసేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు.

తుమ్మల బాబు రాజకీయంగా ఎదుగుతున్న తీరు, పార్టీ శ్రేణుల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణను కొందరు జీర్ణించుకోలేక దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని నాగేశ్వరావు ఆరోపించారు. స్వపక్షంలోనే ఉంటూ ఒకలా, కూటమిలోని రాజకీయ ప్రత్యర్థులతో మరోలా వ్యవహరిస్తూ పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

ఏదైనా వ్యక్తిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు వాటికి సంబంధించి వాస్తవ ఆధారాలు, అధికారిక పత్రాలు ఉంటే వాటిని ప్రజల ముందుంచాలని, కేవలం వార్తా కథనాలు లేదా సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది నిష్పాక్షిక విచారణ ద్వారా తేలాల్సిన అంశమని స్పష్టం చేశారు.

అవినీతి లేదా అక్రమాలకు సంబంధించి ఎవరి మీదైనా ఆరోపణలు ఉంటే సంబంధిత అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని నాగేశ్వరావు కోరారు. విచారణకు ముందే ఒక వ్యక్తిని దోషిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

తుమ్మల బాబుపై జరుగుతున్న ప్రచారం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రాజకీయంగా సమాధానం చెప్పలేని వారు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. జనసేన పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన నాయకుడి మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను పార్టీ శ్రేణులు సహించబోవని హెచ్చరించారు.

తుమ్మల రామస్వామి బాబు ఎప్పుడూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తున్న నాయకుడని నాగేశ్వరావు తెలిపారు. సహకార రంగంలో రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా పనిచేయాల్సిన సమయంలో వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ వివాదాలతో ఆయనను ఇబ్బందులకు గురిచేయడం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని అన్నారు.

కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు, జనసేన శ్రేణుల్లో అనుమానాలు రేకెత్తించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని కార్యకర్తలు, ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే ఏ అంశంపైనైనా స్పందించాలని సూచించారు.


ఆధారాలు లేకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వారిపై, వాటి వెనుక ఉన్న వ్యక్తులపై అవసరమైన చట్టపరమైన, రాజకీయ చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని నాగేశ్వరావు తెలిపారు. తుమ్మల బాబు ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలకు ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.

పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నమ్మకాన్ని సంపాదించుకున్న నాయకుడిగా తుమ్మల బాబు తన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతారని, ఎన్ని దుష్ప్రచారాలు జరిగినా జనసేన పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలను ప్రజలు గుర్తిస్తారని గొర్లి నాగేశ్వరావు పేర్కొన్నారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మాజీ సీఎం జగన్ ను కలిసిన ఇన్చార్జి తోట



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 25:** తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్సీపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, విద్యార్థి విభాగం జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ పాల్గొన్నారు. మీటింగ్ అనంతరం జగన్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం లోని పరిస్థితులను వివరించారు.

## రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఎంతో అవసరం.

**-వేలంక భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధుల సభలో, దినేశ్ కులకర్ణి**






**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 25:** కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) కాకినాడ జిల్లా ప్రతినిధుల సభ నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభకు అఖిల భారత సంఘటన మంత్రి దినేశ్ కులకర్ణి విశిష్ట అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా రైతులు ఉద్యమ స్ఫూర్తి కలిగిన వారని,గతంలో యర్రవరంలో జాతీయ రహదారిని దిగ్బంధనం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.దక్షిణ ప్రాంత సంఘటన మంత్రి దోనూరు రాము మాట్లాడుతూ వ్యవసాయానికి మించిన వృత్తి మరొకటి లేదని,రైతు లేకపోతే మానవ జీవితం శూన్యంగా మారుతుందన్నారు.రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి మాట్లాడుతూ పంటల బీమా చేయించడమే తప్ప,రైతులకు నష్టపరిహారం అందిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల జమీల్ మాట్లాడుతూ అక్టోబరు 6న విజయవాడలో నిర్వహించనున్న శక్తి ప్రదర్శనకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు మాట్లాడుతూ రైతును,రైతు వృత్తిని ప్రభుత్వాలు చులకనగా చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ,జిల్లా కమిటీ కార్యదర్శి గట్టి అశోక్,సభ్యులు జాజిమొగ్గల ఈశ్వర్, మాసిన రామసాయి,కాకిలేటి వీర్రాజు,పెదిరెడ్ల గంగారావు,ముక్కు సుబ్రహ్మణ్యం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 25:** ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు పరిధిలో జ్ఞాన జ్యోతి శిక్షణ శిబిరాలు మంగళవారంతో ముగిసాయి.సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షణ ద్వారా ఆరు రోజులపాటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండల పరిధిలోని 141 అంగన్వాడి కార్యకర్తలకు 120 రోజులు సర్టిఫికెట్ కోర్స్ ట్రైనింగ్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ

ప్రత్తిపాడు--ఏలేశ్వరం మండలాల్లో 141 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 6 రోజుల శిక్షణను పూర్తి చేశారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, బోధనా నైపుణ్యాలు , అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో "జ్ఞాన జ్యోతి రెండు, మూడు సంవత్సరాల కు సంభందించి 6 రోజుల శిక్షణ లో భాగంగా ఈనెల 11,12,13, తేదీలలో మొదటి విడత శిక్షణ, నిర్వహించామని రెండో విడతగా 23, 24, 25 ఈ మూడు రోజులు నిర్వహించడం జరిగిందని తెలిపారు.నాన్-రెసిడెన్షియల్ విధానంలో ఈ శిక్షణను ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ శిక్షణను నిర్వహించినట్లు తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు చిన్నారుల ప్రాథమిక విద్య, అభ్యసన సామర్థ్యాల పెంపు, పిల్లల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించామన్నారు.శిక్షణలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలపై వివరించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అంగన్వాడీ కార్యకర్తలకు కార్యక్రమం ముగింపు సందర్భంగా జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు ఎంఈఓ లు అబ్బాయి,రాజబాబు,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చక్రవేణి, ధర్మవరం,పెద్దనాపల్లి ప్రధానోపాధ్యాయులు , ఎస్ జీ టి డి ఆర్ పిలు గణేష్ రమణ రోహిణి, రాజు నరేంద్ర, విజయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పలువురు అధికారులను ఘనంగా సన్మానించారు.

## పెద్దాపురంలో వృద్ధాశ్రమం నిర్మాణ పనుల పరిశీలన





**పెద్దాపురం, పెన్ పవర్,ఆగస్టు 25:** స్వర్ణ పెద్దాపురం నియోజకవర్గం పరిధిలో పెద్దాపురం పట్టణంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమం నిర్మాణ పనులను పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.వృద్ధాశ్రమం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. వృద్ధులకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని మౌలిక వసతులతో ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. పనులను నాణ్యతతో పూర్తి చేసి వృద్ధులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## -రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై టిడిపి ఇంటింటా ప్రచారం.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,25:**:రెండేళ్ల కూటమి పాలనలో నమ్మకం,అభివృద్ధి, సంక్షేమంపై కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో టిడిపి నాయకులు 7 వ రోజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.జగ్గంపేట ఎమ్మెల్యే,టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాలతో రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమపై బూరుగుపూడి గ్రామ ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుంచే తాతాజీ ఆధ్వర్యంలో యూనిట్ ఇంచార్జ్ పాఠంశెట్టి కొండరాజులు పర్యవేక్షణలో భూత్ ఇన్చార్జిలందరూ ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి నాగేశ్వరరావు,బాలుకుల చిన్నోడు,మండల టిడిపి కార్యదర్శి మూరా సత్తిబాబు, పాఠంశెట్టి విశ్వనాథం, బాలిన వెంకటేశ్వరరావు, సోము పుచ్చయ్య, మంచెం బాబ్జి,పాటంశెట్టి గణేష్,పాఠంశెట్టి తమ్మారావు, రామిశెట్టి రాజు,పాఠంశెట్టి రాంబాబు, వజ్రపు శేఖర్ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన మూడో రోజు ఆట.. లంక పోరాడినా భారత్‌దే ఆధిపత్యం

- భారత్‌తో రెండో టెస్టులో శ్రీలంక ప్రతిఘటన
- అజేయంగా 84 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేస్తున్న సోనాల్ దినూశ
- మూడో రోజు ఆట ముగిసేసరికి శ్రీలంక స్కోరు 265/8
- ప్రస్తుతం 238 పరుగుల భారీ ఆధిక్యంలో టీమిండియా
- వర్షం, వెలుతురులేమి కారణంగా ముందుగానే ముగిసిన ఆట




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక గట్టిగా పోరాడుతున్నప్పటికీ, టీమిండియా పట్టు బిగించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం భారత్ ఇంకా 238 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌పై పూర్తి నియంత్రణతో ఉంది. మూడో రోజు ఆటలో శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినూశ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 135 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత స్పిన్నర్లపై స్వీప్ షాట్లను సమర్థంగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను ఒక అరుదైన ఘనత సాధించాడు. భారత్‌పై తన తొలి మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడు 50ం స్కోర్లు సాధించిన రెండో శ్రీలంక బ్యాటర్‌గా (దులీప్ మెండిస్ తర్వాత) రికార్డు సృష్టించాడు.

అతనికి కేశర నువంత (18) నుంచి కొంత సహకారం లభించింది. అయితే, వీరి భాగస్వామ్యాన్ని భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ విడదీశాడు. సుతార్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన నువంత, మిడ్-ఆఫ్‌లో సారాంశ్ జైన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశాడు. మూడో రోజు చివరి సెషన్‌లో రెండో కొత్త బంతి అందుబాటులోకి రావడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించాలని భారత్ భావించింది. కానీ, వెలుతురు తగ్గడంతో స్పిన్నర్లతోనే బౌలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం ప్రారంభమవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వాతావరణం అనుకూలించకపోవడంతో 5:15 గంటలకు మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. ఆట ముగిసే సమయానికి దినూశ 84 పరుగులతో, లహిరు కుమార 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు (503/9 డిక్లేర్డ్)కు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కేవలం రెండు వికెట్లు మాత్రమే చేతిలో ఉన్నందున, నాలుగో రోజు శ్రీలంక ఇన్నింగ్స్‌ను త్వరగా ముగించి, మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించాలని టీమిండియా భావిస్తోంది.

# బౌలర్‌గానూ వైభవ్ సూర్యవంశీ అదుర్స్.. ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు

- దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో వైభవ్ 8 పరుగులకే ఔట్
- కేవలం ఆరు బంతులే ఎదుర్కొన్న యువ బ్యాటర్
- రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసిన వైభవ్
- ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసిన వైనం

**హైదరాబాద్ పెన్ పవర్:** వైభవ్ సూర్యవంశీ అంటే బ్యాట్‌తో విధ్వంసమే గుర్తుకొస్తుంది. కానీ, ఈసారి బంతితోనూ అదరగొట్టాడు. నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో బంతితో మాత్రం తనలోని కొత్త టాలెంట్‌ను బయటపెట్టాడు. నార్త్ ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి 146, షాబాజ్ అహ్మద్ 167 పరుగులతో రాణించారు. అనంతరం నార్త్ ఈస్ట్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కట్టడి చేసిన ఈస్ట్ జోన్ ఫాలోఆన్ విధించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ నార్త్ ఈస్ట్ జోన్ బ్యాటర్లు తడబడ్డారు. 90 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. వైభవ్ సూర్యవంశీ తన ఎడమచేతి స్పిన్‌తో ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. జట్టు తరఫున అత్యధికంగా 25 పరుగులు చేసిన కిషన్ లింగ్‌డో, 4 పరుగులు చేసిన ఇమ్లివాటి లెమ్టూర్‌ను వైభవ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ రెండు వికెట్లు కూడా అతడికి క్యాచ్‌ల రూపంలో దక్కడం విశేషం. దీంతో వైభవ్‌కు ఒకే ఓవర్లో 'డబుల్ డిలైట్' దక్కిందని బీసీసీఐ సోషల్ మీడియాలో ప్రశంసించింది. మరోవైపు వైభవ్ జెర్సీ నంబర్‌పైనా ఆసక్తికర చర్చ సాగింది. అతడి జెర్సీ నంబర్‌లో కొంత భాగాన్ని టేప్‌తో కప్పి ఉంచారు. దీంతో కేవలం '3' మాత్రమే కనిపించింది.



ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా వైభవ్ '3' నంబర్ జెర్సీ ధరిస్తాడు. జెర్సీపై ముద్రణలో లోపం వల్లే మిగిలిన సంఖ్యను టేప్‌తో కప్పి ఉండొచ్చని భావిస్తున్నారు.

# కోహ్లీ, రోహిత్ లేకపోతే ఇంతేనా?.. అయ్యయ్యో బీసీసీఐకి కోట్లు నష్టం వచ్చిందిగా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత రిచెస్ట్ క్రికెట్ బోర్డ్ అయిన బీసీసీఐకి టీమిండియా టైటిల్ స్పాన్సర్‌షిప్ విషయంలో ఊహించని షాక్ తగిలింది. రాబోయే రెండేళ్లలో భారత్ స్వదేశంలో ఆడబోయే సుమారు 35 మ్యాచ్‌ల కోసం ప్రతీ మ్యాచ్‌కి కనీస ధరగా రూ. 4.85 కోట్లను నిర్ణయించి టెండర్లు పిలిచింది. కానీ ఆగస్టు 13వ తేదీ నాటికి బిడ్స్ సమర్పించడానికి గడువు ముగిసినప్పటికీ, ఒక్క కంపెనీ కూడా ముందుకు రాలేకపోయింది. బీసీసీఐ చరిత్రలోనే బిడ్లు రాక గడువు పొడిగించాల్సి రావడం తొలిసారి. ప్రస్తుతం టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రతి మ్యాచ్‌కి రూ. 4.2 కోట్లు చెల్లిస్తుండగా, బీసీసీఐ ఏకంగా ధరను భారీగా పెంచడంతో కంపెనీలు వెనకడుగు వేశాయి.




**కోహ్లీ, రోహిత్ లేకపోతే క్రేజ్ తగ్గినట్లేనా?:**

ధరను భారీగా పెంచడంతో పాటు స్పాన్సర్లు ముందుకు రాకపోవడానికి వెనుక మరో ప్రధాన కారణం ఉందనే టాక్ గట్టిగానే నడుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు టెస్టులు, టీ20లకు దూరమవ్వడమే బ్రాండ్ విలువ తగ్గడానికి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఇద్దరు ప్లేయర్లు లేకపోతే మ్యాచ్‌లకు ఉండే వ్యూయర్‌షిప్, బ్రాండ్ రీచ్ భారీగా తగ్గుతుందని లెక్కిస్తున్న కంపెనీలు.. అంత పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడానికి ఆలోచిస్తున్నాయి.

**గూగుల్ జెమిని, ఎస్‌బీఐ లైఫ్‌తో డైరెక్ట్ చర్చలు:**

జూలై 20వ తేదీన ఐటీటీ డాక్యుమెంట్స్ విడుదల చేసి గడువు పెట్టినా బిడ్లు రాకపోవడంతో బీసీసీఐ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలపై ఫోకస్ పెట్టింది.

డైరెక్ట్ టాక్స్: గూగుల్ జెమిని , స్పిన్నీ , ఎస్‌బీఐ లైఫ్ లాంటి పలు బ్రాండ్లతో బోర్డు నేరుగా చర్చలు జరుపుతోంది.

ఆర్ఎఫ్‌క్యూ విడుదల: అసోసియేట్ పార్ట్‌నర్ హక్కుల కోసం రిక్వెస్ట్ ఫర్ కొటేషన్ రిలీజ్ చేసింది. పత్రాలు కొనుగోలు చేయడానికి ఆగస్టు 14, స్పష్టతకు ఆగస్టు 16, కొటేషన్లు సమర్పించడానికి ఆగస్టు 25 లాస్ట్ డేట్ గా నిర్ణయించింది.

టైటిల్ స్పాన్సర్ కన్ఫర్మ్ అయిన తర్వాతే అసోసియేట్ పార్ట్‌నర్లు ఖరారవుతారు. హోమ్ సీజన్ ప్రారంభమయ్యేలోపే బీసీసీఐ ఆశించిన భారీ ధరకి స్పాన్సర్‌షిప్ డీల్ క్లోజ్ అవుతుందో లేదో చూడాల్సి ఉంది.



# నాని 'ప్యారడైజ్'కి ఆ టైం ఉండదా?



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' మూవీని మొదట ఆగస్టు నెలలో విడుదల చేయాలని భావించారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా వేశారు. ప్యారడైజ్ ఆలస్యం కావడంతో రవితేజ 'ఇరుముడి' సినిమాకు కలిసి వచ్చింది. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవితేజ ఇరుముడి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. మొదటి వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి దాదాపు వంద కోట్ల వసూళ్లకు చేరువ అయింది. అతి తక్కువ సమయంలోనే యూఎస్‌లో మిలియన్ డాలర్ల వసూళ్లు నమోదు చేసింది. అంతకు ముందు వారం విడుదలైన సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. లక్కీ ఆగస్టు ను నాని ప్యారడైజ్ మిస్ చేసుకుంది అంటూ చాలా మంది అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని మూవీ...**

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను రాజమౌళి కంటే ఎక్కువగా చెక్కుతున్నట్లు అనిపిస్తుందని, ఇకపై అయినా సినిమాను పూర్తి చేసి విడుదలకు రెడీ చేయాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం సినిమా షూటింగ్ ఇంకా బ్యాలన్స్ ఉంది. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. షూటింగ్ ఇంకా రెండు వారాలు పట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సినిమాకు అనిరుథ్ సంగీతాన్ని అందించాల్సి ఉంది. షూటింగ్ పూర్తి చేసి ఇస్తే తప్ప రీ రికార్డింగ్ పూర్తి చేసి ఇవ్వలేని పరిస్థితి. అనిరుథ్ చాలా బిజీ మ్యూజిషియన్ అనే విషయం తెల్సిందే. ఆయనకు డెడ్ లైన్ పెట్టకుండా , సినిమాను విడుదల తేదీకి కనీసం నెల ముందు అయినా ఇవ్వాలనే టాక్ ఉంది. కానీ వారం రెండు వారాల సమయం ఇచ్చి హడావిడిగా ఇవ్వాలంటే అనిరుథ్ ఎలా రియాక్ట్ అవుతాడో అనేది చూడాలి.

**నాని ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ డేట్...**

అనిరుథ్ ను కన్విన్స్ చేసి ఏదోలా వర్క్ చేయించుకున్నా ది ప్యారడైజ్ మూవీ యూనిట్ కి ప్రమోషన్ చేసేందుకు సరైన సమయం ఉండక పోవచ్చు అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. సినిమా విడుదలకు వారం ఉండగ కూడా ఏదో ఒక వర్క్‌తో హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరోయిన్ కయాదు బిజీగా ఉంటే ప్రమోషన్‌లో కనిపించేది ఎవరు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కాలంలో విడుదలై మంచి విజయాలను సొంతం చేసుకున్న సినిమాలను చూస్తే ఎక్కువ శాతం రెండు మూడు వారాలు, అంతకు మించి ప్రమోషన్ చేసిన సినిమాలు ఉన్నాయి. అంతెందుకు ఇటీవల విడుదలైన ఇరుముడి సినిమాను రవితేజ, శివ నిర్వాన రెండు మూడు వారాలు ముందు ఉండి మరీ ప్రమోషన్ చేశారు. రవితేజ ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చాడు. శివ నిర్వాన చాలా ఇంటర్వ్యూలు ఇవ్వడంతో పాటు, ప్రెస్‌మీట్స్ లో కనిపించాడు.

**నాని, శ్రీకాంత్ ఓదెల మూవీ..**

అంతకు ముందు వచ్చిన సినిమాల విషయంలోనూ ప్రమోషన్ కీలక పాత్ర పోషించింది. అందుకే కంటెంట్ కంటే ప్రధానంగా ప్రమోషన్‌కి టైంను చూసుకుంటున్నారు. ప్రమోషన్స్ కు సమయం లేని కారణంగా వాయిదా పడ్డ సినిమాలు ఉన్నాయి అంటే అతిశయోక్తి కాదు. పరిస్థితులు ఇలా ఉంటే ది ప్యారడైజ్ సినిమాను మాత్రం పెద్దగా ప్రమోషన్ లేకుండానే వచ్చే నెల 24న విడుదల చేయాలని మేకర్స్ హడావిడి చేస్తున్నారు. ది ప్యారడైజ్ మూవీకి ఉన్న బజ్ నేపథ్యంలో నైజాం ఏరియాలో భారీ బిజినెస్ చేసింది. ఇతర ఏరియాల్లోనూ నాని కెరీర్‌లో బెస్ట్ నెంబర్స్ నమోదు అయ్యాయి అంటున్నారు. నైజాం ఏరియాలో నెవ్వర్ బిఫోర్ నెంబర్స్‌ను నాని చూస్తాడనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే ఆలస్యం అయిన సినిమాను మరోసారి వాయిదా వేసే పరిస్థితి లేదు. కనుక శ్రీకాంత్ ఓదెల కాస్త ప్రమోషన్ విషయంలోనూ దృష్టి పెట్టాలని, నాని కాస్త బయటకు వచ్చి సినిమా గురించి జనాల్లో తెలిసేలా మాట్లాడాలంటూ ఫ్యాన్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక వైపు షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేస్తూనే ప్రమోషన్ వర్క్ సైతం చేయాల్సిన అవసరం ఉంది. మరి నాని, శ్రీకాంత్ ఈ విషయాన్ని ఎలా బ్యాలన్స్ చేస్తారో చూడాలి. సెప్టెంబర్ 24న విడుదల కాబోతున్న ది ప్యారడైజ్ మూవీకి పెద్దగా పోటీ లేకపోవడం వల్ల సాలిడ్ ఓపెనింగ్స్ నమోదు కావడం ఖాయం అని విశ్లేషకులు అంటున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com